# మందు

శ్రీయుత బి. కృష్ణరావుగారు

'అమ్మాయి నిన్న సాయంత్రమల్లా బాగానేవుండిందండీ పిన్నీ. ఒక్కటే జ్వరం. మీ అల్లుడుగారైనా వూళ్ళోలేరైరి... వారు నిన్న ఉదయమే మా ఆడబిడ్డగారి వూరికి వెళ్ళారు. వారు వెళ్ళేప్పటికి గూడా బాగానే ఆడుకుంటూ వుందండీ........ అంతా సిద్ధమై చివరకి కోటేసుకొనే సరికి, 'నేనూ వూరికి వొస్తానని' అమ్మాయి యెక్కడలేని మారాము. మొదలెట్టింది— యెందుకిల్లా అనవసరంగా మారాం చేస్తూ వుందా అనినారు కొంచం విసుక్కుని. అణా చేతులోపెట్టి, అప్పటిమట్టుకి యెల్లానో సముదాయించి వెళ్ళిపోయారు. తరువాత సాయంత్రందాకా బాగానే ఆడుకుంది— కొంచం చీకటిపడగానే నేను పిల్లకి అన్నం పెట్టి పడుకోబెట్టాను. అర్ధగంట తరువాత మా రాముడికికూడా వొడ్డించి వొచ్చి చూతునుగదా అమ్మాయికి కాస్త వొళ్ళు వెచ్చబడివుంది. దృష్టిదోషం యేమన్నా తగిలిందేమోనని కాసిని మిరపకాయలూ, యేడు చీపురుపుల్లలూ వొంటిమీదినించి తిప్పి పొయిలో పోశాను. పుల్లలన్నీ చిటపటమన్నాయి—పిడికెడన్ని మిరపకాయలు తిప్పి పొయిలో వేసినా యింట్లో కొంచమైనా ఘాటన్న మాటేలేదు, అదో విధమైన మాడువాసన తప్ప.'

'అవునండీ అమ్మాయికి బాగా దిష్టే అయివుంటుంది.'

'యేమోనండీ, యేమీ తెలియటం లేదు. పిన్నీ, అసలు దృష్టి దోషమవుతే యింత జ్వర మెందుకొస్తుందండీ—నిన్న సాయంత్రంనించీ వొకటే జ్వరం—యింత వరకు చెమటన్న మాటేలేదు.'

'బజారులో యెక్కడచూచినా అక్కడ తల్లి ప్రత్యక్షం—ఆమె మహిమేమన్నా కనపడుతూ వుందేమో చూచారా.'

'పిన్నీ ఆకాస్తేదో మీరేచూతురూ? కాపురానికి వొచ్చి ఆరు సంవత్సరాలయినా నాకటువంటి దేదీ యింతవరకు అనుభవంలోకి రాలేదు—మీ పుణ్యముంటుంది, అదేదో మీరే చూచిపెట్టండి.'

'అయ్యో, దానికి యింత ప్రాధేయపడాల్సిన అవసరమేముందండీ? అమ్మాయిని చూచి నాకు తెలిసిందేదో చెప్పకపోతే మేము యింటిపక్కనే వుండిమాత్రం యేమి లాభం.'

శాంత చెమ్మగిల్లిన నేత్రాలని కొంగుతో వొత్తుకుంటూ 'బుజ్జి' పడుకొనివున్న గదిలోకి దారితీసింది. రాధమ్మగారు కాస్త విచారంగా, మెదలకండా శాంతను అనుసరించింది—యిద్దరూ రోగిని పరీక్షించి,

రెండు నిమిషాల తరువాత గది వెలుపలికి వొచ్చారు.

'యింకేమీ లేదమ్మా—యిదంతా ఆ తల్లి ప్రభావమే.'

'పిన్నీ, అమ్మాయికి ఈరోజే మందు పోయమంటారా, వొద్దా' అని శాంత కొంచం ఆదుర్దాగా పిన్నినడిగింది.

'మందా! అసలు ఈరోజు మందుమాటే యెత్తవొద్దు—ఆతల్లికి శాస్త్ర దండంపెట్టి రెండుపైసలు ముడుపుగట్టండి. ఆమె కృప వల్ల జ్వరం ఈరోజు సాయంత్రం వరకూ తిరుగుముఖం పడుతుంది.'

రాధమ్మగారు వెళ్ళిపోవటంతోనే శాంత పైసలుతీసి, అమ్మవారికి దండంపెట్టి ముడుపు కట్టింది. యింక ఆరోజుకి మందూ, గిందూ అంతా చెల్లు—

* * *

మరునాడుకూడా 'బుజ్జి'కి జ్వరం తగ్గ లేదు. ఆరోజు రాత్రంతా వొకటే పలవరింతలు—కూతురు అవస్థచూచి శాంత ఆ రోజురాత్రి యెంత ప్రయత్నం చేసినా పడుకోలేకపోయింది. ఉదయం లేవటంతోనే తమ్ముణ్ణి పిల్చి—

'రామూ, యిది తల్లి ప్రభావంకాదూ, మన్నూకాదు. 'బుజ్జి' కేదో పెద్ద జబ్బు చేసింది. దానికి పడుకున్నపాటు కదలటానికి కూడా చాత నవటంలేదు. రెండు రోజుల క్రితం వొచ్చిన జ్వరం యింతవరకూ దిగ లేదు. నీవుపోయి యెవరినన్నా మంచి డాక్టర్ని తీసుకొస్తేనేకాని లాభంలేదంటూ' ఆమె కళ్ళల్లో నీళ్ళు నింపుకుంది.

అక్కగారి దైన్యాన్నిచూచి రాము యేమీ మాట్లాడలేకపోయాడు. తక్షణమే కార్యాలు తీర్చుకొని, కోటుకూడా వేసుకోకుండా పైతుండుగుడ్డపైనే వుండగా డాక్టరు దగ్గరికి వెళ్ళాడాతను అమితమైన ఆవేదనతో.

అర్ధగంట తరువాత డాక్టరువొచ్చి 'బుజ్జి'ని యెంతోసేపు పరీక్షించాడు. సంగతి సందర్భాలు చూస్తే మనిషేమీ నిర్ధారణకి వొచ్చినట్లు తోచలేదు రాముకి—జబ్బేమిటో కనుక్కుందామన్న ఉద్దేశంతో

'యేమిటీ, యింతసేపు పరిక్షించారు' అన్నాడు రాము.

'ఆఁ, యేమీలేదు. రెండు రోజుల్లో నిమ్మళిస్తుంది.'

వొకనిముషం ఆగి ఆతనిముఖ కవళికని వీక్షించి—'మామూలు జ్వరానికే మీరు యింత గాభరాపడట మెందుకండీ' అని రాముని హెచ్చించి, ఆతన్ని మందుకోసం వెంటబెట్టుకొని కారులో యింటివేపు బయల్దేరాడు డాక్టరు బాబు.

'అసలు జబ్బేమిటని' కొంచంసేపుఅయిన తరువాత మళ్ళీ రెట్టించాడు రాము డాక్టరుని—

'యేదో పెద్దపేరు చెబితేమాత్రం లాభమేమిటి. మీకు జబ్బు నయమవటం ప్రధానంగాని.'

అంతటితో రామునోటికి తాళంపడింది. దారిపొడుగునా మళ్ళీ యేవిధమైన ప్రశ్న లకికూడా యిహ తావులేకపోయింది.

నాలుగు రోజులయినా అమ్మాయి జ్వరం తిరుగుముఖం పట్టలేదు—యింటి వాళ్ళకి డాక్టరుని మార్చటం తప్ప వేరే గత్యంతరమేమీ కనపడలేదు.

* * *

రోజుకి రోజూ అమ్మాయి చిక్కి శల్య మైపోతూవుంది. యెందరు డాక్టర్లువొచ్చినా అసలు జబ్బు విషయమై యేమీ నిర్ధారణ చేయలేకండా వున్నారు. వొహరు 'టైపా యిడు' వొహరు 'నిమోనియా' అంటారు. యిక్కడి డాక్టర్ల సంగతంతా చూచి అనవ సరంగా కాలహరణం చేయటం సమంజసం కాదని తెలుసుకుని, బావగారొస్తే అమ్మాయినిగురించి యేదో ఆలోచిస్తారనే ఆశతో రాము 'అమ్మాయి జబ్బుగావుందని' తంతి నిచ్చాడు విశ్వేశ్వరరావుగారికి.

తంతిని చూడటంతోనే విశ్వేశ్వరరావుకి పైప్రాణాలు పైననే లేచిపోయినాయి. కొంచమైనా ఆలస్యం చేయకండా తక్షణమే చెల్లెలి యుక్తంగా ఆవూరినించి బయల్దేరా డాతను.

ఇంటికి వొచ్చేసరికల్లా గూట్లో దీపాలు పెట్టే సమయమయింది. వొచ్చే రావటం తోనే కాళ్ళయినా కడుక్కోకండా ఆతను దగ్గరికివెళ్ళి 'బుజ్జీ, బుజ్జీ' అని ఆ నాలుగు యేళ్ళ కూనని తట్టిలేపాడు.

అమ్మాయి చివరకి కదలనైనా కదల కండా, నీరసంవల్ల అట్లానే పడుకునివుంది. తల్లి ఆవిషయం గమనించి 'బుజ్జీ, బుజ్జీ మీ నాన్నగారు వొచ్చారే' అంది.

'నాన్న' అన్నమాట వినటంతోనే బుజ్జి కళ్ళు తెరిచింది. గది నాలుగు మూలలు వొహమాటు కలియజూచి నిజంగా 'నాన్న గారు' వొచ్చారని తెలుసుకుని, నీరసంగా చిరునవ్వునవ్వుతూ రెండుచేతుల్నీ ఆతనికి అందించింది. విశ్వేశ్వరరావు లాలనగాఅమ్మా యిని వొళ్ళోకి తీసుకుని 'నాతల్లికి జబ్బు చేసిందా'అంటూ గట్టిగా ముద్దెట్టుకున్నాడు.

బుజ్జి గొల్లున నవ్వి 'నాన్నగారి' మొహా న్నంతా తన చిన్ని చేతుల్తో తుడుముతూ, అదో విధమైన అందంగా కళ్ళు తల్లికేసి తిప్పింది.

కూతురు చూపుల్లోని అర్థం గ్రహించి 'యేమమ్మా! మీనాన్నగారు వొచ్చారా, నీకోసం వూరినించి యేమి తీసుకొచ్చారో అడుగు' అంది శాంత ప్రేమపూర్వకంగా బుజ్జి బుగ్గ గిల్లుతూ.

ఆ సాయంత్రం నించీ బుజ్జి జ్వరం మటు మాయమై పోయింది.

* * *

'యెందరో డాక్టర్లు కుదుర్చలేని జబ్బుని వైద్యమంటే అసలే తెలియని విశ్వేశ్వర రావుగారు నయం చేశారు' అంటుంది శాంత అప్పుడప్పుడు వేళాకోళంగా తన భర్తతో.